అధికారులతో కలిసి మంజూరునగర్‌లోని సభాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జీఎస్ఆర్

రేపు డిప్యూటీ సీఎం పర్యటన

భూపాలపల్లి రూరల్, జూన్ 15 : భూపాలపల్లి నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మంగళవారం పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. ఆదివారం సాయంత్రం భూపాలపల్లి మంజూరునగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 10 గంటలకు కొత్తపల్లి గోరి మండలం చెన్నాపూర్ శివారులో రూ.2 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని ఉప ముఖ్యమంత్రి ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం మంజూరునగర్ 8 ఇంక్లైన్ రోడ్డులో చర్చి ఎదురుగా ఉన్న మైదానంలో మంజూరునగర్ (భూపాలపల్లి), ధర్మరావుపేట (గణపురం మండలం), నవాబుపేట(చిట్యాల మండలం) గ్రామాల్లో నిర్మించనున్న సబ్‌స్టేషన్ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని, అనంతరం గణపురం మండలం చెల్పూర్ జెన్కోలో సింగరేణి, జెన్కో అధికారులతో వేర్వేరుగా సమీక్ష నిర్వహించనున్నట్లు వివరించారు. కాగా, మంజూరునగర్‌లో ఏర్పాటు చేయనున్న సభా ప్రాంగాణాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సింగరేణి, జెన్కో, పోలీసు, ఇతర శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు.

ఆటో నుంచి కిందపడి ఒకరి మృతి

కాటారం, జూన్ 15 : నడుస్తున్న ఆటో నుంచి కింద పడి ఒకరు మృతిచెందారు. మండలంలోని కాటారం-మంథని రహదారిపై వ్యవసాయ మార్కెట్ యార్డ్ సమీపంలో వీరాపూర్ గ్రామానికి చెందిన శివశంకర్ ప్రాజెక్ట్ నీటి సంఘం మాజీ చైర్మన్ వేమునూరి పోచిరెడ్డి(57) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మండలకేంద్రమైన గారెపల్లిలో ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం మల్హార్ మండలం కొండంపేటలో తన బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు వెళ్లి ఇంటికి తిరిగి రావడానికి గంగారం క్రాస్ రోడ్డు వద్ద ఆటోలో ఎక్కాడు. వెనుక సీట్లో ప్రయాణికులు ఉండడంతో డ్రైవర్ పక్క సీట్లో కూర్చున్నాడు. ఆటో మండలకేంద్రానికి వస్తుండగా మార్కెట్ యార్డ్ వద్ద పోచిరెడ్డి స్పృహ కోల్పోయి ఆటోలో నుంచి కిందపడ్డాడు. దీంతో అతడి తలకు తీవ్రగాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ శేఖర్ 108కు కాల్ చేయడంతో సిబ్బంద వచ్చి పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని మహాదేవపూర్ దవాఖానకు తరలించారు. మృతుడికి భార్య సత్యమ్మ, కూతురు అనూష, కుమారుడు అరుణ్ ఉన్నారు. భార్య సత్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై-2 శ్రీనివాస్ తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కృష్ణ కాలనీ, జూన్ 15 : జయశంకర్ భూపాలపల్లిలోని సుభాష్ కాలనీకి చెందిన గుండు శంకరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా కాలనీ ఆదర్శ పద్మశాలి సహకార సంఘం సభ్యులు ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి దుబాసి రాజయ్య, గౌరవ అధ్యక్షుడు గోరంట్ల విక్రమ్, సేన ఉపాధ్యక్షుడు చీకటి తిరుపతి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఉద్యోగి కుటుంబానికి..

ములుగురూరల్ : మండలంలోని బరిగలానిపల్లి గ్రామానికి చెందిన మట్టెవాడ నరేశ్ ఎస్‌బీఐలో పనిచేస్తూ కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా ఆదివారం బాధిత కుటుంబాన్ని ఎస్‌బీఐ ఔట్‌సోర్సింగ్ యూనియన్ నేతలు పరామర్శించారు. బ్యాంకు ఉన్నతాధికారులతో కలిసి యూనియన్ తరుపున రూ.1లక్ష ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్, నాయకులు అహ్మద్, వీరన్న, సత్యం, రాజు, అంకూస్, అశోక్ పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల కొత్త ఫోన్ నంబర్లు

ములుగురూరల్, జూన్ 15 : ములుగు డివిజన్ పరిధిలోని విద్యుత్ శాఖలో విధులు నిర్వర్తిస్తున్న అధికారులకు నూతన సెల్ నెంబర్లను కేటాయించినట్లు డీఈ పులుసం నాగేశ్వర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు డీఈ 8712486760, ములుగు ఏడీఈ 8712486805, ఏఈ 8712486796, ఏటూరునాగారం ఏడీఈ 8712486783, ఏఈ 8712486764, వెంకటాపురం(నూగూరు) ఏడీఈ 8712486833, ఏఈ 8712486824, మల్లంపల్లి ఏఈ 8712486792, వెంకటాపూర్ ఏఈ 8712486821, ప్రసా ఏఈ 8712486806, తాడ్వాయి ఏఈ 8712486815, కమలాపురం ఏఈ 8712486784, కన్నాయిగూడెం ఏఈ 8712486782, వాజేడు ఏఈ 8712486831 నంబర్లలో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని సూచించారు.

పూడికతీతకు నోచుకోని డ్రైనేజీలు

ఏటూరునాగారంలో పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న డ్రైనేజీ

పేరుకుపోయిన చెత్తాచెదారం

ఏటూరునాగారం, జూన్ 15 : మండల కేంద్రంలో డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. వర్షాకాలం వచ్చిన ప్పటికీ పూడికతీతకు నోచుకోవడం లేదు. మట్టి, చెత్త, ప్లాస్టిక్ బాటిల్స్ నిండుకుని ఉన్నాయి. దీంతో నీళ్లు సరిగా పోవడం లేదు. డ్రైనేజీల్లో మట్టి నిండి పిచ్చి మొక్కలు మొలకెత్తాయి. పూడిక తీతకు నోచుకోకపోవడంతో మురుగు నీరు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో ప్రజలు, పిల్లలు వ్యాధుల బారిన పడుతున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పిచ్చిమొక్కలు, చెత్తతో నిండి ఉన్న డ్రైనేజీ

ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలి

మంగపేట, జూన్ 15: ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ఎస్సై టీవీఆర్ సూరి సూచించారు. వాహనదారులతో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని వివిధ ప్రదేశాల్లో ఇటీవల రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు మృతిచెందారని, ప్రమాదాలకు గురైన వారు హెల్మెట్ ధరించి ఉంటే ప్రమాద తీవ్రత తగ్గేదని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. ఇటీవల జరిగిన లోక్‌అదాలత్‌లో 70 మందికి డ్రంక్ అండ్ డ్రైవ్ కింద జరిమానా విధించి, 10 మందికి మూడు రోజుల జైలు శిక్ష వేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న బాధితులు

తేనెటీగల దాడిలో పది మందికి గాయాలు

మహదేవపూర్ జూన్ 15 : పది మందిపై తేనెటీగలు దాడి చేసిన ఘటన మండల కేంద్రంలోని ఎర్ర చెరువు సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన చిలుముల రామచంద్రం తన కుటుంబ సభ్యులు పది మందితో కలిసి ఆదివారం ఎర్ర చెరువు సమీపంలో ఎర్రమ్మ తల్లిని పూజించేందుకు వెళ్లారు. అయితే, ఒక్కసారిగా అక్కడ తేనెటీగల గుంపు దాడి చేయడంతో వారు పరుగులు తీశారు. విషయాన్ని బంధువులకు తెలపడంతో వారు బాధితులను స్థానిక ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. ఈ దాడిలో కాటారం మాజీ ఎంపీటీసీ మహేశ్వరి గాయపడడంతో పలువురు ఆమెను పరామర్శించారు.

వంట కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏటూరునాగారం, జూన్ 15 : మధ్యాహ్న భోజన వంట కార్మికుల సమస్యలు పరిష్కరించి, మెనూ చార్జీలు సరిపోయేలా పెంచాలని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి జంపాల రవీందర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదు నెలలుగా బిల్లులు, వేతనాలు రావడం లేదన్నారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి పోరెడ్డి ప్రమీల, వంట కార్మిక సంఘం బాధ్యులు సామల రమ, చిటమట లక్ష్మి, మట్టి లక్ష్మి, ఇర్సవడ్ల నర్సమ్మ, మామిడి పార్వతి, కల్పన, మల్లమ్మ, కుప్ప చిన్నమ్మ, రామక్క, సరోజన, వెంకటమ్మ, మునమ్మ పాల్గొన్నారు.

26నుంచి ఎస్ఎఫ్ఐ మహాసభలు

కాటారం, జూన్ 15 : ఈ నెల 26, 27, 28 తేదీల్లో జరిగే ఎస్ఎఫ్ఐ 18వ జాతీయ మహా సభలను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర కిరణ్, జిల్లా అధ్యక్షుడు బొడ్డు స్మరణ్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో జాతీయ మహాసభల వాల్ పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. నాయకులు రాజు, శ్రావణ్ పాల్గొన్నారు.

గోవిందరావుపేట : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గోవిందరావుపేట, జూన్15ః మండలంలోని చల్వాయి జడ్పీఎస్ఎస్ పాఠశాలలో 1996-1997 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. నాటి గురుకులను పాఠశాలకు పిలిచి వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. బడిలో చదివిన నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని పూర్వ విద్యార్థులు ఆనందంగా గడిపారు. పాఠశాల ఆవరణలో ఖోఖో, దాడుగు మూతలు వంటి ఆటలను ఆడారు. ఈ బ్యాచ్‌కు ఏర్పాటుకు కారురాలైన ఏటూకూరి అనితను వారు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సలేంద్రం, రాజ్‌కుమార్, తాటిపెల్లి రాజు, గుంట శంకర్, లావుడ్య లచ్చిరామ్, చెప్పల రాజేశ్, లోడిగె రఘువీర్, సామ శ్రీను, బల్లెం ముత్తయ్య, మందడి సారంగపాణి, ఐత రాజు, విజయ్‌కుమార్, ఊరపెద్ది మల్లేశ్, బండపెల్లి కేదారి, నరాల శ్రీనివాస్‌రెడ్డి, కన్నెకంటి సురేంద్రచారి తదితరులు ఉన్నారు.

ఏటూరునాగారం : పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఏటూరునాగారం, జూన్ 15 : మండలంలోని చిన్నబోయినపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో2000, 2001 టెన్త్ బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. దూర ప్రాంతాల్లో ఉన్న పూర్వ విద్యార్థులంతా ఈ సమ్మేళనంలో పాల్గొని తమ అనుభూతులు పంచుకున్నారు. కార్యక్రమంలో రిటైర్టు ప్రధానోపాధ్యాయుడు కనకయ్య, ఉపాధ్యాయులు కల్తి శ్రీనువాస్, ధరావతు రాజు, సదానందం, అంజనమూర్తి, యాదయ్య, శ్రీరాములు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి

మృతి చెందిన దుక్కిటెద్దు వద్ద రైతు కొడిపే లక్ష్మయ్య

కృష్ణ కాలనీ, జూన్ 15 : విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో భూపాలపల్లి మండలంలోని నాగారం గ్రామంలో కొడిపే లక్ష్మయ్య అనే రైతుకు చెందిన దుక్కిటెద్దు ఆదివారం ఉదయం విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఎద్దును రోజువారి లాగానే ఆదివారం ఉదయం మేతకు వదిలిపెట్టామని, ఇంతలోనే గ్రామ చివరలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలు తాకి మృతిచెందిందని బాధిత రైతు బోరున విలపించారు. ఆ ఎద్దుతోనే ఏటా వ్యవసాయ భూమిని దున్నుకొని పంట పండించుకుంటున్నట్లు చెప్పాడు. ఎద్దు మృతితో వ్యవసాయం ఎలా చేసుకోవాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఎలాంటి భద్రత ఏర్పాట్లు చేయకపోవడంతోనే తన ఎద్దు మృతి చెందిందని ఆరోపించాడు. ఎద్దు విలువ రూ.50 వేలు ఉంటుందని, తనను ప్రభుత్వం ఆదుకోవాలని లక్ష్మయ్య వేడుకుంటున్నాడు.

తిమ్మాపూర్‌లో ఆవు..

వెంకటాపూర్ : విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన ఘటన తిమ్మాపూర్‌లో ఆదివారం సాయంత్రం జరిగింది. మండలంలోని బూర్గుపేట జీపీ పరిధిలోని అందుగులమీదికి చెందిన రైతు భూనేని రమేశ్ ఆవు మేతకు వెళ్లి వస్తూ తిమ్మాపూర్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆగింది. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. విద్యుత్ అధికారులు వచ్చి పంచనామా చేపట్టారని, ఆవు విలువ రూ.70వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

డీఎస్పీకి గ్రామస్తుల సన్మానం

గణపురం, జూన్ 15 : మండలంలోని పరుశురాంపల్లి గ్రామానికి చెందిన పైడిపల్లి మల్లక్క, రాజ కొమురయ్య దంపతుల కుమారుడు పైడిపల్లి తిరుపతి అసిస్టెంట్ కమాండర్/డీఎస్పీగా పదోన్నతి పొంది హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తూ ఆదివారం స్వగ్రామానికి రాగా, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి పుష్పగుచ్చం అందించారు. తన గ్రామం నుంచి ఒక వ్యక్తి ఎస్సైగా ఎంపికై డీఎస్పీగా పదోన్నతి పొందడంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చింతి రెడ్డి సమ్మిరెడ్డి, ఉడుత రవీందర్, కొడారి బాబు, మంతుర్తి భద్రయ్య, ఆకుల శ్రీనివాస్, పెంట దేవేందర్, చెన్నవేని కృష్ణ పాల్గొన్నారు.


అసిస్టెంట్ కమాండర్/డీఎస్పీని సన్మానిస్తున్న గ్రామస్తులు

చెరువు శిఖానికి సరిహద్దులు ఏర్పాటు చేయాలి

మంగపేట, జూన్ 15 : మండలంలోని బోరునర్సాపురం-చెరుపల్లి రెవెన్యూ శివారు మధ్యలో ఉన్న ఉప్పలనర్స య్య చెరువు శిఖానికి హద్దులు ఏర్పాటు చేయాలని ఆయకట్టు రైతులు కోరారు. ఈ మేరకు చెరువు కట్ట వద్ద వారు ఆదివారం వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ చెరువు శిఖం ఆక్రమణకు గురి కావడం వల్ల సాగు నీటి సామర్థ్యం తగ్గిపోయి ఆయకట్టులో పరి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు శిఖానికి సరిహద్దులు ఏర్పాటు చేసి, శిఖం భూముల్లోకి ఆక్రమణ దారులు వచ్చి సాగు చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాగే, మండల వ్యాప్తంగా చాలా చెరువులు ఆక్రమణకు గురయ్యాయని తెలిపారు. కోతులకుంట అనే చెరువును మొత్తం ఆక్రమించి ఆనవాళ్లే లేకుండా చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మిషన్ కాకతీయ పథకాన్ని ప్రవేశపెట్టి చెరువులను పునరుద్ధరిస్తే ప్రస్తుతం వాటి బాగోగులు పట్టించుకునే వారు లేక ఆక్రమణకు గురవుతున్నాయని రైతులు ఆరోపించారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి ఉప్పలనర్సయ్య చెరువుతో పాటుగా ఆక్రమణకు గురైన ఇతర చెరువుల శిఖం భూములకు సరిహద్దులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

చెరువు కట్టవద్ద నిరసన తెలుపుతున్న రైతులు

నేడు 'చలో తెలంగాణ భవన్'

మహదేవపూర్, జూన్ 15 : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై పెట్టిన అక్రమ కేసులో భాగంగా ఏసీబీ విచారణకు హాజరవుతున్న సందర్భంగా మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఆధ్వర్యంలో కేటీఆర్‌కు సంఘీభావంగా సోమవారం చేపట్టే చలో తెలంగాణ భవన్ కార్యక్రమానికి మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని పార్టీ మండల అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్‌రావు, యూత్ అధ్యక్షుడు ఎండీ ఆలీమ్ ఖాన్ ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రజల పక్షాన ప్రభుత్వంపై అనుక్షణం పోరాటం చేస్తున్న కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టడం తగదని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలే బుద్ధి చెప్తారని తెలిపారు.

నేడు నిరుద్యోగ యువతకు ఉపాధి మేళా

మొగుళ్లపల్లి, జూన్ 15 : ఈజీఎంఎం శాఖ ద్వారా సిరి టెక్నాలజీస్ ఆధ్వర్యంలో మండలంలో నిరుద్యోగ యువతకు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఉచిత శిక్షణ, ఉపాధి మేళా నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతకు కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంటర్నెట్ స్కిల్స్ , కమ్యూనికేషన్స్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, ఇంటర్వ్యూ డెవలప్‌మెంట్ స్కిల్స్, పర్సనల్ డెవలప్‌మెంట్ రంగాల్లో ఐదు నెలల శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి, యూనిఫామ్స్ బుక్స్ ఇవ్వడంతో పాటు శిక్షణ అనంతరం సర్టిఫికెట్స్ ఇచ్చి ఉపాధి కల్పించనున్నట్లు వివరించారు.

ఘటనా స్థలంలో లారీలు

రెండు లారీలు ఢీ.. డ్రైవర్‌కు గాయాలు

గణపురం, జూన్ 15 : రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొట్టుకోవడంతో ఒక డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. భూపాలపల్లి నుంచి పరకాలకు వెళ్తున్న లారీ, పరకాల నుంచి భూపాలపల్లి వైపు వస్తున్న లారీ మండలంలోని గాంధీనగర్ కర్కపల్లి గ్రామాల మధ్య జాతీయ రహదారిపై ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. దీంతో ఒక లారీ నడుపుతున్న డ్రైవర్‌కు గాయాలు కాగా 108 వాహనంలో ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదం జరగడంతో ఇరువైపులా ట్రాఫిక్ జామ్ అయింది. ఘటనా స్థలానికి స్థానిక ఎస్సై రేఖా అశోక్ చేరుకొని ప్రమాదానికి గురైన వాహనాలను తొలగించి, ట్రాఫిక్ క్లియర్ చేయించారు.

దూలపురం పరిధి జలపాతాల సందర్శన నిషేధం

వాజేడు, జూన్ 15 : మండలంలో దూలపురం అటవీ శాఖ రేంజ్ పరిధిలో ఉన్న మాసలొద్ది, విఫాల్స్(దూసపాటిలొద్ది) కోంగాల జలపాతం, గుండం జలపాతం సందర్శనకు పర్యాటకులను అనుమతించడం లేదని రేంజ్ అధికారి కే బాలకృష్ణ ఆదివారం తెలిపారు. జలపాతాల వద్ద రక్షణ లేకపోవడం, పర్యాటకులు జలపాతం లోతు అంచనా వేయలేక మృత్యువాత పడిన ఘటనల నేపథ్యంలో ఈ మూడు జలపాతాల సందర్శనకు అనుమతి నిలిపివేశామన్నారు. నిబంధనలు అతిక్రమించి వెళ్లిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని రక్షణ ఏర్పాట్లు ఉన్న బొగత జలపాతాన్ని మాత్రమే పర్యాటకులు సందర్శించాలని సూచించారు.

ఎస్సైని కలిసిన బీఆర్ఎస్ నేతలు

వెంకటాపూర్, జూన్ 15 : మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై చల్లా రాజును ఆదివారం బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు నర్ర భద్రయ్య, పీఏసీఎస్ చైర్మన్ కాసర్ల కుమారస్వామి, మాజీ ఎంపీటీసీలు పోశాల వీరమల్లు, దగ్గు ప్రభాకర్‌రావు, ఎల్లావుల మల్లేశ్, ప్రధాన కార్యదర్శి జనగాం రవీందర్, నాయకులు మహ్మద్ జహీర్‌పాష, శ్రీధర్, రమేశ్, మహేందర్, సాగర్, సంపత్, సతీశ్‌రెడ్డి, దేవేందర్ పాల్గొన్నారు.

ఇసుక రీచ్ అనుమతులు రద్దు చేయాలి

వెంకటాపురం(నూగూరు), జూన్15 : పెసా చట్టాన్ని ఉల్లంఘించిన ఇసుక రీచ్ అనుమతులను రద్దు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు తుర్వ కృష్ణబాబు డిమాండ్ చేశారు. ఆదివారం మండలకేంద్రంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మట్లాడారు. సీతారాంపురం గ్రామం అలుబాక(2) హెబిటేషన్ పరిధిలో ఉందని, అయితే, అధికారులు పెసా చట్టం నిబంధనలు ఉల్లంఘించి బోదాపురం గ్రామంలో పెసా గ్రామ సభను నిర్వహించి, అధికారులకు తప్పుడు నివేదిక పంపించారని ఆరోపించారు. గ్రామ సభ తీర్మానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు తాటి రాంబాబు, సందీప్, రఘు, సంజయ్, అశోక్ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

చిట్యాల, జూన్ 15 : రైతు భూముల సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ షేక్ ఇమామ్‌బాబా తెలిపారు. ఆదివారం ముచినిపర్తి శివారు పరిధిలోని గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన సదస్సులో రైతుల నుండి 250 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు.

డీఎస్పీని కలిసిన నాయకులు

కాటారం, జూన్ 15 : కాటారం డీఎస్పీగా మూడు రోజుల క్రితం బాధ్యతలు చేపట్టిన సూర్యనారాయణను ఆదివారం మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, పలు సంఘాల నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. సబ్‌డివిజన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం కొమురయ్య, నేతకాని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండగొర్ల రాంనారాయణ, ఆదర్శనగర్ కాలనీ కన్వీనర్ కుమార్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

వెంకటాపూర్, జూన్15 : ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ వేడుకలను జూలై 7న ఘనంగా నిర్వహించాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ములుగు జిల్లా ఇన్‌చార్జి చాతాళ్ల రమేశ్ పిలుపునిచ్చారు. తాళ్లపాడు సెంటర్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో సభలు నిర్వహించి, జెండా ఆవిష్కరించాలని సూచించారు. సమావేశంలో శ్యాంబాబు, సంపత్, అశోక్, అనిల్, రమేశ్, భాస్కర్, శ్రీనివాస్, విజేందర్, కిరణ్, బద్రి, రాజు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా ఒకరి మృతి

తాడ్వాయి, జూన్15 : మండలంలోని మేడారంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. ఒడిశా నుంచి వచ్చానని చెప్పుకుంటూ గ్రామంలో ఓ వ్యక్తి మేస్త్రీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. రాత్రి ఏడు గంటల సమయంలో సదరు వ్యక్తి రెడ్డిగూడెం సమీపంలోని బత్తిని రాజు ఇంటికి సమీపంలో పడిపోయి ఉండడంతో స్థానికులు 108కు సమాచారం అందించారు. సిబ్బంది పరీక్షించి అతడు మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది.

బహిరంగ సభను విజయవంతం చేయాలి

గణపురం, జూన్ 15 : తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ పిలుపుమేరకు ఈనెల 18న జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ యునైటెడ్ ఫ్రంట్ సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలివేరు మల్లయ్య పిలుపునిచ్చారు. ఆదివారం కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రంలో బ్రాంచ్ ప్రెసిడెంట్ ఇనుగాల కుమార్, కార్యదర్శి పెరుమాండ్ల కృష్ణమూర్తి, 1535 రాష్ట్ర జెన్కో యూనియన్ అధ్యక్షుడు వేణు ఆధ్వర్యంలో జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు పిలిచి, ఆర్టిజన్ కార్మికుల సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేటీపీపీ నాయకులు కొడపాక కిరణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, SHAMALA RAMESH @ SAMALA RAMESH S/o Veeraiah, R/o. H.No. 4-17, Kothaguda Village and Mandal, Mahabubabad Dist - 506391 T.G. Changed my name from SHAMALA @ SAMALA RAMESH to SHAMALA RAMESH @ SAMALA RAMESH for all purposes.

WANTED

★ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.

NT-325336

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

అక్రమ